నమస్తే తెలంగాణ
# వరంగల్
3 | వరంగల్, బుధవారం 7 మే 2025 | WARANGAL

# శభాష్ పోచంపల్లి

- ఉమ్మడి జిల్లా బృందానికి కేటీఆర్ అభినందన
- ఎల్కతుర్తి రజతోత్సవ మహాసభ విజయవంతంపై హర్షం

హనుమకొండ, మే 6 : బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేసిన ఉమ్మడి జిల్లా బృందాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అభినందించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో వరంగల్ నేతలతో ప్రత్యేకంగా భేటీ అయిన కేటీఆర్ వరంగల్ సభ సక్సెస్, ఇతర అంశాలను, అనుభూతులను పంచుకున్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర నుంచి భారత రాష్ట్ర సమితి 25 ఏళ్ల ఉత్సవం వరకు వరంగల్ కేంద్రంగా ఏ సభ నిర్వహించినా చరిత్రకెక్కిందని, ఇది కూడా ఆ తరహాలోనే చరిత్రలోకి ఈ సభ ఎక్కబోతుందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ ఉనికి, భావజాల వ్యాప్తి, పార్టీ నిర్వహించిన బహిరంగ సభలన్నీ వరంగల్ సభలతో పోల్చుకునేలా జన సమీకరణ చేశారని, లక్షలాది పార్టీ కార్యకర్తలకు సకల సౌకర్యాలు కల్పించారని చెప్పారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ నేతలను ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సమన్వయం చేస్తూ సభ విజయవంతానికి కృషిచేశారని, నిర్వహణలో పొరపాట్లు లేకుండా ముందుకుసాగారని కేటీఆర్ అభినందించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ కే వాసుదేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హైదరాబాద్‌లో కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉమ్మడి జిల్లా నాయకులు


నర్మెట : కన్నెబోయినగూడెంలో ఎగిరిపోయిన రైస్‌మిల్ పైకప్పు రేకులు


వరంగల్‌లోని కరీమాబాద్‌లో కూలిన ఇంటి పైకప్పు

# ఆగని వర్షం.. తీరని నష్టం

## ఉమ్మడి జిల్లాలో ఈదురుగాలుల బీభత్సం

- పలు గ్రామాల్లో కురిసిన రాళ్ల వాన
- నేలవాలిన వరి.. రాలిన మామిడి
- ఎగిరిపోయిన ఇండ్ల పైకప్పులు
- కూలిన చెట్లు, విరిగిన విద్యుత్ స్తంభాలు
- కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో తడిసిన ధాన్యం, మక్కలు
- ధర్మసాగర్‌లో షెడ్డు కూలి 35 మేకలు మృతి


ఐనవోలు : వెంకటాపురంలో నేల రాలిన మామిడి కాయలు

హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన రాళ్లవాన బీభత్సం సృష్టించింది. గాలుల ధాటికి రోడ్లపై చెట్లు కూలిపోవడంతో పాటు పలు ఇండ్లు, రైస్‌మిల్లులు, ఇతర పరిశ్రమలపై కప్పులు ఎగిరిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడి సరఫరా నిలిచిపోయింది. కోతకొచ్చిన వరి నేలవాలగా, మామిడి కాయలు రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మక్కలు తడిసిపోయాయి. పలు కేంద్రాల్లో వరద నీరు చేరగా, రోడ్లపై, మార్కెట్‌లో ఎండబోసిన వడ్లు కొట్టుకుపోయాయి. కేంద్రాల్లో బస్తాల్లో నింపి కాంటాలు పెట్టిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో అవి తడిసిముద్దయ్యాయి. దీంతో వాటిని ఆరబెట్టేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నర్మెట, స్టేషన్‌ఘన్‌పూర్, హనుమకొండ, కాజీపేట, దామెర, ఎల్కతుర్తి, ఐనవోలు, ధర్మసాగర్, ఖిలావరంగల్, నర్సంపేట, చెన్నారావుపేట, వర్ధన్నపేట, కేసముద్రం, దంతాలపల్లి, పెద్దవంగర మండలాల్లోని పలు గ్రామాల్లో గాలివాన బీభత్సంతో అపార నష్టం వాటిల్లింది. జనగామ జిల్లా నర్మెట మండలం కన్నెబోయినగూడెంలో రైస్‌మిల్లు పైకప్పు ఎగిరిపోవడంతో అందులో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. రోజులు గడుస్తున్నా కాంటాలు పెట్టడం లేదని, టార్పాలిన్లు కప్పినా భారీ గాలులకు అవి కొట్టుకుపోయి వడ్లు తడిసిపోయాయని, వెంటనే కొనాలని రైతులు అధికారులు, ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా, ధర్మసాగర్ మండల కేంద్రంలో ఏనుగుల శ్రీనివాస్‌కు చెందిన షెడ్డు కూలిపోయి అందులో ఉన్న సుమారు 35 మేకలు మృతి చెందాయి. - నమస్తే నెట్‌వర్క్, మే 6


నర్మెట : తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న మహిళా రైతు


నర్సంపేట : పట్టణంలోని 19వ వార్డులో విరిగిన విద్యుత్ స్తంభం, కూలిన చెట్టు


హసన్‌పర్తి మండలం పెగడపల్లి రింగ్‌రోడ్‌పై వర్షానికి కొట్టుకుపోయిన ఆరబోసిన వడ్లు


ధర్మసాగర్ మండల కేంద్రంలో షెడ్డు కూలి మృతి చెందిన మేకలు


స్టేషన్‌ఘన్‌పూర్ : మాన్‌సింగ్ తండాలో నేల వాలిన వరి

# మిల్లులకు తరలించరు.. కాంటాలు పెట్టరు..

- రవాణా వాహనాల కొరతతో సెంటర్లలోనే బస్తాలు
- అకాల వర్షంతో తడిసి ముద్దవుతున్న ధాన్యం నిల్వలు
- అగ్గువకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు
- కేంద్రాల నిర్వాహకులపై అన్నదాతల ఆగ్రహం
- పెద్దవంగరలో వడ్ల బస్తాకు నిప్పంటించి నిరసన


పెద్దవంగరలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలకు నిప్పంటించి నిరసన తెలుపుతున్న రైతులు

### మళ్లీ వానొస్తే వడ్లు తడుస్తయ్..



కొనుగోలు కేంద్రంలో అమ్మేందుకు 340 బస్తాల ధాన్యాన్ని తీసుకొచ్చిన. బస్తాలు కాంటాలై చాలా రోజులవుతున్నది. ఇప్పటికీ మిల్లులకు తరలించలేదు. ఓ వైపు చీకటి పడిందంటే ఎప్పుడు వానొస్తదోనని ఆందోళన చెందుతున్నం. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వెంటనే స్పందించి మిల్లులకు తరలించేందుకు లారీలు పంపించాలి.

– జాటోత్ సత్తు, గిరిజన రైతు, రామచంద్రతండా

తొర్రూరు/పెద్దవంగర, మే 6: కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి కాంటాలు కాక ఇబ్బందులు పడుతున్న రైతులకు మరో సమస్య వచ్చిపడింది. రవాణా వాహనాల కొరతతో కాంటాలైన బస్తాలను మిల్లులకు తరలించకపోవడంతో అవి కేంద్రాల్లోనే పేరుకుపోతున్నాయి. దీంతో కొత్తగా క్రయ విక్రయాలు చేపట్టకపోవడంతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. సెంటర్లలో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. తొర్రూరు, పెద్దవంగర మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు పెరుగుతుండడంతో వర్షం భయంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అగ్గువకు అమ్ముకుంటున్నారు. తొర్రూరు మండలం మాటేడులోని కొనుగోలు కేంద్రంలో రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. రవాణా వాహనాలు లేకపోవడంతో ప్రైవేట్ ట్రాక్టర్లలో ధాన్యాన్ని మిల్లులకు తరలించుకోవాలని అధికారులు చెప్పడంపై మండిపడ్డారు. అలాగే పెద్దవంగర మండల కేంద్రంలోని సెంటర్‌లో నిర్వాహకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వడ్ల బస్తాకు నిప్పంటించి రైతులు నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కాంటాలు పెట్టి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరుతున్నారు. కాగా, రవాణా వాహనాల కొరతను ఎదుర్కొంటున్న అధికారులు మంగళవారం రోడ్డెక్కారు. తొర్రూరులోని పాల కేంద్రం వద్ద తహసీల్దార్లు శ్రీనివాస్, మహేందర్, ఎస్సై రాంజీనాయక్, ఇతర సిబ్బంది మాటువేసి ఖాళీగా వెళ్లే లారీలను నిలిపి, కిరాయిలు మాట్లాడి కొనుగోలు కేంద్రాలకు తరలించారు.


తొర్రూరు: మాటేడు కొనుగోలు కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

# 25 రోజులైనా ధాన్యం కొనరా?

- రైతులను ఆగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- కేసీఆర్ పాలనలోనే రైతులకు లబ్ధి
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు

మహబూబాబాద్ రూరల్, మే 6 : 'మార్కెట్‌లో రైతులు 25 రోజుల నుంచి వడ్లు పోసుకుని పడిగాపులు గాస్తున్నా కొనుగోలు చేయడం లేదు. వర్షం పడితే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను ఆగం చేస్తున్నది' అని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మంగళవారం మహబూబాబాద్ మండల పరిధిలోని శనిగపురం, ముడుపుగల్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ప్రభుత్వం కొనడం లేదన్నారు. ఆరుగాలం కష్టపడి పండించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మడానికి వస్తే నిర్లక్ష్యం చేస్తున్నదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, కొనుగోళ్లను వేగవంతం చేయడంలో సర్కారు విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలు, రైతులు, అన్ని వర్గాల ప్రజలకు నష్టం చేసిందన్నారు. గత పదేండ్ల పాలనలో కేసీఆర్ రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధరను అందించి కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ప్రజలకు అమలు గాని హామీలిచ్చి, వాటిని అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ఫెయిలయ్యాడని, రైతులు కేసీఆర్ పాలనను అభినందిస్తున్నారన్నారు. అనంతరం కొనుగోలు సెంటర్లలో రైతుల సమస్యలపై మార్కెట్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నిర్లక్ష్యం చేయకుండా కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సెంటర్ల నిర్వాహకులు, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, మార్నేని వెంకన్న, జెరిపోతుల వెంకన్న, మంగళంపల్లి కన్న, వెంకటాద్రి, అంబాల శివ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు

# తాగునీళ్లు వచ్చినయ్..

### తీరిన మెయిన్‌రోడ్ కాలనీ వాసుల కష్టాలు

నమస్తే ఎఫెక్ట్

పెద్దవంగర, మే 6 : మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్ కాలనీ వాసుల తాగునీటి కష్టాలు తీరాయి. మంగళవారం 'పల్లెల్లో తాగునీటి కష్టాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు మిషన్ భగీరథ నీరు అందించారు. మెయిన్‌రోడ్‌లో గల మూడు బోర్లలో ఒకదానిలో మాత్రమే నీరుందని మిషన్ భగీరథ ఏఈ యాకుబ్ పాషా తెలిపారు. మిగిలిన రెండు బోర్లు అడుగంటడంతో పనికిరాకుండా పోయాయన్నారు. వాటి స్థానంలో మళ్లీ బోర్లు వేయడం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నరేశ్, కారోబార్ కుమారస్వామి, జీపీ సిబ్బంది ఉన్నారు.


కాలనీ వాసులతో మాట్లాడుతున్న అధికారులు

# తండ్రిని చంపారని ప్రతీకారం

- పగతో మహిళపై యువకుడి హత్యాయత్నం
- పోలీస్‌స్టేషన్ సమీపంలోనే దారుణం



భూపాలపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మి

కాటారం, మే 6 : తన తండ్రిని చంపారని పగ పెంచుకున్న యువకుడు ఓ మహిళపై గొడ్డలితో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. కాటారం ట్రైనీ ఎస్సై గీతా రాథోడ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత డిసెంబర్ 14న ఐదు గుంటల భూవివాదం విషయంలో దేవరాంపల్లిలో మారపాక సారయ్య హత్యకు గురయ్యాడు. హత్య చేసిన ఐదుగురు నిందితుల్లో సారయ్య సోదరుడి భార్య లక్ష్మి రెండు నెలల కిందటే షరతులతో కూడిన బెయిల్‌తో బయటకు వచ్చింది. ఆ తర్వాత ములుగు జిల్లా పస్రాలో ఉంటున్నది. ప్రతి మంగళవారం కాటారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకం పెడుతుతన్నది. ఎప్పటిలాగే మంగళవారం బస్సులో కాటారం వచ్చిన లక్ష్మి ప్రధాన కూడలి నుంచి పోలీస్‌స్టేషన్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా సారయ్య కొడుకు అంజి ఒక్కసారిగా గొడ్డలితో తలపై బాదడంతో తీవ్రంగా గాయపడింది. అక్కడే ఉన్న వారు అడ్డుకోవడంతో కొనఊపిరితో బయటపడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. కాగా పారిపోయేందుకు ప్రయత్నించిన అంజిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. లక్ష్మి కుమారుడు కిరణ్ ఫిర్యాదు మేరకు అంజిపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అయితే పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇలాంటి ఘటన జరగడంతో శాంతిభద్రతలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ముందే సంతకాలు.. జూనియర్లకు బాధ్యతలు

- ప్రిస్క్రిప్షన్ ఫాంపై ఇష్టానుసారం వివరాలు!
- ఎంజీఎంహెచ్‌లో వైద్యాధికారుల తీరిది
- పెద్దాసుపత్రిలో వైద్యసేవలపై పర్యవేక్షణ కరువు
- జూనియర్ డాక్టర్ల చేతిలోనే అధికారాలు

వరంగల్ చౌరస్తా, మే 6: ఎంజీఎం హాస్పిటల్‌లో వైద్యసేవలపై పర్యవేక్షణ కరువవుతున్నది. నిత్యం వందలాది రోగులకు సేవలందించే అత్యసవర విభాగం(క్యాజువాలిటీ)లోనే వైద్యాధికారులు విధులకు ఆలస్యంగా హాజరవడమే గాక రాత్రివేళల్లో జూనియర్ డాక్టర్లకు బాధ్యతలు అప్పగించి తప్పుకొంటున్నారు. ఈ విభాగంలోకి తీసుకొచ్చిన పేషెంట్‌కి ఎక్స్‌రే, స్కానింగ్, ఈసీజీ లాంటి పరీక్షలు చేసేందుకు క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్(సీఎంఓ) హోదా ఉన్న వైద్యుడు గానీ, డ్యూటీ మెడికల్ ఆఫీసర్(డీఎంఓ) గానీ ప్రిస్క్రిప్షన్ ఫాంపై రోగి పూర్తి వివరాలు నమోదు చేసి సంతకం చేయాల్సి ఉంటుంది. ఇవేవీ పట్టనట్లు వైద్యాధికారులు విధులకు రాకుండా సంతకం చేయకపోవడంతో వివరాల నమోదులో ఇబ్బందులను ప్రస్తావించిన సిబ్బందిపై జూనియర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ సమస్యకు క్యా జువాలిటీ, డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు తమకు అనుకూలంగా సులువైన పరిష్కారాన్ని కనుగొన్నారు. ఇందుకోసం ముందుగానే సంతకం చేసిన ప్రిస్క్రిప్షన్ ఫాంలను జూనియర్ డాక్టర్లకు అందుబాటులో ఉంచి తాపీగా విధులకు ఎగనామం పెట్టేస్తున్నారు. జూనియర్లు సైతం పైస్థాయి అధికారుల మెప్పు కోసం తలాడిస్తున్నారు.




ముందుగానే సంతకాలు పెట్టి ఉన్న ప్రిస్క్రిప్షన్ ఫాం

### ఎంఎల్‌సీ కేసులో సంతకం కీలకం

మెడికో లీగల్ కేస్(ఎంఎల్‌సీ)లో క్షతగాత్రుడికి లేదా రోగికి అత్యవసర విభాగంలో నిర్వహించిన చికిత్స కీలకంగా పరిగణించబడుతుంది. అలాంటి కేసులు వచ్చినప్పుడు స్వయంగా సీఎంఓ లేదా డీఎంవో అతడి పూర్తి వివరాలతో పాటు గుర్తింపు చిహ్నాలు(ఐడెంటిఫికేషన్ మార్క్స్) సైతం నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలనే కోర్టు కీలకంగా పరిగణిస్తుంది. అలాంటి కీలక పత్రాలపై ఇష్టారీతిన సంతకాలు చేసి, వదిలివెళ్లడాన్ని రోగులు, కొందరు ఎంజీఎం ఉద్యోగులు సైతం తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్యాజువాలిటీ సేవలపై దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# హామీలపై చేతులెత్తేసిన కాంగ్రెస్

- సీఎం చెప్పల దొంగైతే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల పరిస్థితేంటి?
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, మే6: పాలన చేతకాక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక మూడున్నరేళ్ల ముందే కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం నర్సంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో తనను బ్యాంకర్లు చెప్పుల దొంగలాగా చూస్తున్నారని అభివర్ణించుకోవడం దురదృష్టకరమన్నారు. దేశం ముందు తెలంగాణ పరువు తీస్తున్న ఆయన రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు, ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించి తన్నుకు చావండని సలహాలు ఇస్తున్నాడని ఆరోపించారు. సీఎం చెప్పుల దొంగగా కనబడితే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ హయాంలో ఎఫ్ఆర్‌బీఎం, కేంద్రప్రభుత్వం అనుమతితోనే అప్పులు చేశామని, దేశంలో మన కన్నా 28 రాష్ట్రాలు ఎక్కువగా అప్పులు చేశాయని, మిగతా రాష్ట్రాల్లో ఈ పరిస్థితి లేనప్పుడు మనకెందుకు వచ్చిందన్నారు. సీఎం మాటలు విన్నాక రాష్ట్రంలో ఏ కాంట్రాక్టర్ కూడా ముందుకు వచ్చి పనులు చేయలేని పరిస్థితి ఉందన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలు కూడా కష్టసాధ్యమేనన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, మహాలక్ష్మి, రైతు భరోసా, రుణమాఫీ, కల్యాణలక్ష్మి తులం బంగారం, పింఛన్ల పెంపులాంటి పథకాల అమలుపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోయారని చెప్పారు. ఏమాత్రం పరిపాలన అనుభవం లేని సీఎం, మంత్రులకు రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదని, వీరిపై రాజద్రోహం కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. దేశంలోనే అత్యధిక జీడీపీని కలిగి, అత్యధికంగా జీఎస్టీ చెల్లించే స్థాయికి ఎదిగిన తెలంగాణను అప్పులు పుట్టని రాష్ట్రంగా మారిందని చెప్పడం రాష్ట్ర ప్రజల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమేనన్నారు. తెలంగాణ సాధనలో ఉద్యోగుల పాత్ర కీలకమైనదని, వారి హక్కుల సాధనకు ప్రతిపక్షంగా బీఆర్ ఎస్ పార్టీ వెంట ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగులతో చర్చలు జరిపి వారి డిమాండ్ల ను తక్షణమే నెరవేర్చాలని ఆయన కోరారు. పెట్టుబడిదారులు రాష్ట్రానికి రాకుండా, ఉద్యోగాల కల్పన జరుగకుండా సీఎం వ్యాఖ్యలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు.

# ప్యాడీ క్లీనర్ కోసం రైతుల గొడవ

### యంత్రం నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ లోపం



ప్యాడీ క్లీనర్ కోసం గొడవ పడుతున్న రైతులు

నెల్లికుదురు, మే 6 : మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్ కోసం పార్వతమ్మగూడెం–నెల్లికుదురు రైతులు గొడవ పడ్డారు. నెల్లికుదురు ధాన్యం కొనుగోలు కేంద్రంలో అటు పార్వతమ్మ గూడెం, ఇటు నెల్లికుదురు రైతులు ఎక్కువ సంఖ్యలో ధాన్యం రాశులు పోశారు. ఎక్కువ ధాన్యం రాశులు ఉన్నప్పటికి కేవలం ఒక ప్యాడీ క్లీనర్ మాత్రమే ఉండడంతో రైతులు 20 రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం రెండు గ్రామాల రైతులు ప్యాడీ క్లీనర్ నాకు కావాలంటే నాకే కావాలంటూ గొడవకు దిగారు. కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి తదనుగుణంగా సౌకర్యాలు కల్పించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కేంద్రం నిర్వాహకులు జోక్యం చేసుకుని గొడవను సద్దుమణిగించారు.